

# బండరాయి దగ్గర వెండు

**వెన్నెల ...**

వెండిలా పరుచుకుంది మెరుస్తూ.

చెట్ల ఆకుసందుల్లోంచి చంద మామ దోబూచు లాడుకుంటున్నాడు.

సందులోంచి బండరాయి మీద పడుతున్న వెలుగు పడిపోయిన వెన్నెల ముక్కలా ఉంది.

గేటు దగ్గరి నుంచి బండరాయి వరకు వచ్చి ఆగిపోయిన సన్నని కాలి బాట వెలుతురులో పరుగెడుతున్న పాములా ఉంది.

ఖరీదైన జీవితం వెళ్లబుచ్చుతున్న వాడి ముందు చింకిపాతలవాడిలా చంద్రుడి ముందు నక్షత్రాలు వెలవెలబోతున్నాయి.

అయినా దరిద్రుడి ఆశలా మిలమిల మెరుస్తున్నాయి.

వేరే వెళ్ళిపోయిన కొడుకు … అవసాన దశలో వచ్చినప్పుడు తండ్రి చావబోతూ కొడుకువైపు చూసిన చివరి చూపుల్లా తళుక్కుమంటున్నాయి.

భయంతో మూలిగినట్టు 'కిర్రు' మంది గేటు…

బతికి చెడ్డ బాట్ల జతలో … తిరిగి తిరిగి విసుగెత్తిన రెండు పాదాలు నిర్లక్ష్యంగా పాములాటి బాటమీదుగా బండరాయి వైపు నడుస్తున్నాయి.

వెన్నెల విడిచిన ఊపిరి చల్లగా ఉంది చచ్చినవాడి శరీరంలా.

దిక్కుమాలినవాడు అన్నిచోట్లా తిరిగినట్టు … పిచ్చి మొక్కలు ఇష్టం వచ్చినట్టు పెరుగుతున్నాయి బాట కిరుపక్కలా — తోటలో ఎక్కడికక్కడాను.

పాదాలు బండరాయి దగ్గిర ఆగిపోయాయి.

వెన్నెల కొద్దిగా జరిగింది.

తెల్లని చీరెమీద నల్లని మాసికలా బండరాయి మీది వెన్నెలముక్క మీద ఆకు నీడ పడుతూంది.

వెలుతురు గదిలోంచి కిటికీ బయట కనుపించే అమావాస్య చీకటిలా ఉందది.

రెండు పాదాలు అసహనంగా ఎండ దగ్గర తచ్చాడి మళ్ళీ ఆగిపోయాయి.

చిరిగిపోని మాసి వెలిసిన పాంటు మీద … ఎప్పుడో చిరుగులు పట్టిన లాల్చీ వంకీకి తగిలించినదానిలా వేళ్ళాడుతూంది.

మనిషిలో ఉన్న సంస్కారం … ముఖానికి జుట్టుకూ లేనట్టు… అది ఎన్నాళ్ళుగానో లేనట్టు … స్పష్టం అవుతుంది మరికొన్నాళ్ళో సరే.

అతని పేరు …?

చక్రవర్తి.

వాడుకలో ఉన్నది 'చక్రి'.

ముద్దుగా పిలిచేటప్పుడు 'చక్రం'.

సాధారణంగా చక్రవర్తిలోని కొసమున్న 'వర్తి'ని ఖర్చుపెట్టి పిలవరెవరూ. అలా పిలిపించుకోవటం కూడా అతనికేమంత ఇష్టం ఉండదు. అలా ఎవరయినా పిలిచినా బాధపడడు. చక్రి అక్కడికి రాని రాత్రి ఉండదు.

అక్కడ …

అక్కడే … ! !

* * *

ఎదురుచూడ్డం చక్రికి అలవాటు. కావాలని ఆలస్యం చెయ్యటం 'సంగీత'కి అలవాటు. వేదనతో తపించిపోతున్న చక్రికి అల్లంత దూరంలో కనుపించే సంగీతను చూడగానే వెన్నెల కురిసినట్లుంటుంది.

వస్తూనే 'చక్రీ' అంటూ అతని కౌగిలిలో ఒదిగిపోతుంది.

ఆ తరవాత ఎన్నో మధుర క్షణాలు.

వాడి చూపులు.

వేడి నిట్టూర్పులు.

బాసలు.

ఆశలు.

ఊసులు.

నిశ్శబ్దం.

ఉన్నట్టుండి ఎవరో ఏదో ఒకటి అనడం.

రెండవవారు ఉలిక్కిపడ్డం.

ఇష్టాలు.

అభిరుచులు.

భవిష్య ప్రణాళికలు.

ఇవన్నీ ఆ ఇద్దరికీ మధురక్షణాలు. భవిష్యత్తులో స్వర్గాన్నందుకోబోవటానికి ఇవన్నీ సోపానాలు.

'చాలా రాత్రయింది.'

'వెళ్దామా?'

'అప్పుడే!'

మౌనం.

'సరే, పోదాం …'

పాములాటి బాటమీద నాలుగు పాదాలు … గేటు కిర్రుమన్నప్పుడు…

బండరాయి ఒంటరిగా మిగిలిపోతుంది.

గేటు దాటాక పది గజాలుమాత్రం ఇద్దరూ కలిసి వెళ్ళి చెరో పక్క విడిపోతారు.

మళ్ళీ మర్నాడే.

చక్రికి ఎదురుచూడ్డం అలవాటు.

ఆలస్యం చెయ్యటం సంగీతకి అలవాటు.

ఇలా పది నెలలు గడిచాయి.

సంగీతలో ఏదో మార్పు.

దానిని బయటపెట్టకుండా మామూలుగా ఉండాలనే తాపత్రయం.

కేవలం నటన.

చక్రి గమనించలేదు.

సంగీత ధోరణిమాత్రం గత పది నెలల సంభాషణలకు విభిన్నంగా సాగుతూంది.

'చక్రి' గుండెలు గుభేలుమన్నాయి ఒకనాడు.

సంగీత ధోరణి అంతా 'డబ్బు' మీదే సాగుతూంది.

చాలా విలువైన జీవితాన్ని గురించే ప్రస్తావిస్తోంది.

'అలాటిది మనకు లభ్యమౌతుందో, లేదో, చక్రీ!'

ఆశల నిచ్చెన ఆకాశానికి వేసి ఒక్కో మెట్టే ఎక్కుతున్న సంగీతను చూస్తూంటే చక్రికి గుండెల్లో ఏదో దిగులు.

'నువ్వీ మధ్య మారిపోతున్నావు.'

'నువ్వు ఉట్టి పిచ్చివాడివి, చక్రీ! మనలో ఉన్న ప్రేమ అంతటినీ తాకట్టుపెట్టినా ఒక్క కారు కొనుక్కునేందుకు సరిపడ డబ్బు వస్తుందంటావా?'

'ఛా! ఏమిటా మాటలు? ప్రేమకు విలువ కడుతున్నావా, సంగీతా!' ఎంతో దీనంగా అడిగాడు చక్రి.

నవ్వేసి ఊరుకుంది.

'నువ్వు పిచ్చివాడివి … నువ్వు పిచ్చివాడివి.' ఆ నవ్వులో ధ్వనించినవి ఆ మాటలే.

చక్రి నిర్విణ్ణుడయ్యాడు.

ఆ తరవాత …

తరవాత …

'మనకో కారు ఉంటే బాగుంటుంది కదూ? తాజ్‌మహల్‌లాటి ఇల్లయినా ఉండాలి. బాంక్ అకౌంటు ఒక ఆకారానికి తక్కువ కాకూడదు…

ఇంటి నిండా నౌకర్లు …

ఇంకా ఎన్నో!

ఎన్నెన్నో!'

'నాలాటివాడికి అవన్నీ సమకూర్చుకోవటం సాధ్యమేనంటావా, సంగీతా?'

'నా కోసం ఏం చేయటానికైనా సిద్ధమేనని ఎన్నో ప్రమాణాలు చేశావు!'

'ఔను.'

'నీ ప్రాణాన్ని ఇమ్మన్నా ఇస్తానన్నావు కదూ?'

'అందుకని?'

'నాకోసం ఈమాత్రం సముపార్జించుకోలేవూ?'

'అసంభవం!'

అలిగి కూర్చుంది సంగీత.

'ఛా. ఏమిటిది, సంగీతా! కలిగిన దానితో నిర్మించుకునే స్వర్గం కంటె కలల స్వర్గంలో కరిగిపోవటం సుఖాన్నిస్తుందంటావా?

కలిగినవాడు కట్టుకున్న ఇళ్ళే వాడికి తాజ్‌మహల్ లాటివి. అలాగని పేదవాడి గుడిసె వాడికి తాజ్‌మహల్ కాకపోదు. ఎవరు సృష్టించుకున్న స్వర్గం వారి కానందం ఇవ్వగలగకపోతే, ఆనందం అంటూ ఈ భూమి మీద ఎవరి ముఖాల్లోనూ, హృదయం లోనూ నిలిచి ఉండేది కాదు!'

సంగీత మాట్లాడలేదు.

మరో రెండు నెలలు గడిచేసరికి ప్రేమకూ, ఐశ్వర్యానికీ మధ్య దాటలేని అగాధం ఏర్పడింది. 'చక్రి' దాదాపు పిచ్చివాడై పోయాడు. దానికి తోడు రోజూ సంగీత తనకోసం రావటం లేదు.

ఆ తోటలో ఆ బండరాయి దగ్గర రోజూ ఎదురుచూస్తూనే ఉన్నాడు.

రెండు రోజులకో … నాలుగు రోజులకో వచ్చి ముభావంగా కాస్సేపు కూర్చుని వెళ్ళే సంగీత … అసలు పూర్తిగా వెళ్ళాళ్ళయి రావటమే మానేసింది.

అయినా చక్రి రోజూ వస్తున్నాడు.

సంగీతకోసం ఎదురుచూస్తున్నాడు.

చూసి చూసి విసుగెత్తి వెళ్ళిపోతున్నాడు.

ఎందుకో తన హృదయంలోని సంగీత రూపం చెదిరిపోతూంది.

ఆమె చూపుల్లోని నిర్మలత్వం క్రూరంగా గోచరిస్తోంది.

ఆమె ముఖంలో ఐశ్వర్య దర్పం, అహంకారం చోటుచేసుకున్నాయి.

చక్రి మనసులో సంగీతకు బదులుగా …

'ఒక లక్ష బాంక్ అకౌంట్ …

తాజ్‌మహల్‌లాంటి భవంతి…

కారు …

నౌకర్లు — చాకర్లు…'

అవే మెదులుతున్నాయి. అయినా లీలగా మసకటి సంగీత రూపం కనుపిస్తోంది.

ఎదురుచూస్తూనే ఉన్నాడు రోజూ…

ఆశ నిరాశ అయింది.

దెబ్బతిన్నవాడిలా అయిపోయాడు.

మనసు చెదిరిపోయింది.

జీవితం మీద గట్టి దెబ్బ కొట్టింది సంగీత.

చక్రి తట్టుకోలేకపోయాడు.

నిగ్రహించుకోలేకపోయాడు.

ఆశ చావటం లేదు.

ఎప్పుడయినా వచ్చి తీరుతుందనే ఆశ ...

చావు దెబ్బ తిన్న ఆశ...

గుండె బద్దలయింది.... మనిషే మారిపోయాడు. ఆ బండరాయి దగ్గరికి ... పాములాటి కాలిబాటద్వారా... రోజూ రావటం మానలేదు. గత స్మృతులు చక్రిని పిచ్చివాణ్ణి చేశాయి. సంగీత ఎన్నోసార్లంది—'నువ్వు పట్టి పిచ్చివాడివి' అని. అదే ... అదే... తనపట్ల ఋజువయింది.

ఆరు నెలల అనంతరం ...

వెన్నెల ...

వెండిలా పరుచుకుంది మెరుస్తూ...

చెట్ల సందులోంచి బండరాయి మీద పడుతున్న వెలుగు విరిగిపడిన వెన్నెలముక్కలా ఉంది...

మృత్యుభయంతో మూలిగినట్టు కిర్రుమంది గేటు...

పాములాటి బాటమీద అస్తవ్యస్తంగా నడుస్తున్న రెండు పాదాలు...

బండరాయి వేపు నడుస్తున్నాయి.

వెన్నెల విడిచిన ఊపిరి చచ్చినవాడి శరీరంలా ఉంది.

కాలిబాట వెన్నెల వెలుగులో పరుగెడుతున్న పాములా ఉంది.

బండరాయి మీద చేతులు. ఊ[illegible] ఆప్పి ... అరగంట క్రితమే ఆరిపోయిన ఓ దీపం.

చక్రవర్తి!!

చక్రం!!!

చక్రి!!

బాట మీద నడిచి వచ్చిన పాదాలు బండరాయి దగ్గర ఆగిపోయాయి.

వెన్నెల వెలుగులో ... స్పష్టంగా... సుస్పష్టంగా ... శుష్కించిపోయి జీవం అంతరించిన చక్రి ముఖం ... బండరాయి మీద ... రెండు చేతుల మధ్య ... పక్కకు తిరిగి...

'చక్రీ!'

అది గావుకేక ... చావుకేక ...

ఎదురుచూడ్డం చక్రికి అలవాటు!

ఆలస్యం చెయ్యటం సంగీతకు వాటు!!

బండరాయి దగ్గర రెండు విగత జీవులు...

ప్రేమను చిత్తుగా ఓడించిన ఐశ్వర్యం వల్ల వంచితురాలైన సంగీత, కడసారిగా ప్రేముఉన్న చోటనే, అది ఉండే చోటనే ప్రాణం వదిలింది చివరకు! ★

[ రెండున్నర సంవత్సరాల అనంతరం, స్వంత ఊరు వచ్చి పాడుపడిన మా తోటలో నేను చూసిన దృశ్యం— 'బండరాయి దగ్గర ఏవో రెండు అస్థిపంజరాలు'. వాటికి ఈ విధంగా రూపకల్పన జరిగింది.

—రచయిత]

కందిలకొండ

ఫోటో— ఎమ్. శోభారాణి (హైదరాబాదు-27)





బూచీ ...

ఫోటో— వేణుగోపాల్ కె. ఠక్కర్ (గుంటూరు-2)